# సాక్షి అనంతపురం

బుధవారం : 26 : జూన్ : 2024






**కలెక్టరేట్‌లో జీటీఎస్**

అనంతపురం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో 1922లో ఏర్పాటు చేసిన జీటీఎస్ ఎంతో ఉపయోగపడుతోంది. 8లో



**చీనీ టన్ను రూ.31 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం
37.5°/23.3°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### రేకులకుంట శాస్త్రవేత్తల బదిలీ

**బుక్కరాయసముద్రం:** మండలంలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో పని చేస్తున్న పలువురు శాస్త్రవేత్తలను బదిలీ చేశారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాధికను ఏలూరు జిల్లా మాటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానానికి బదిలీ చేశారు. ఈమె స్థానంలో కర్నూలు జిల్లా బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ నాయక్‌ను నియమించారు. అలాగే డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డిని పార్వతీపురం జిల్లా సీతంపేట మన్యం వ్యవసాయ పరిశోధనా స్థానానికి బదిలీ చేశారు.

### నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.81.27 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

**గుంతకల్లు రూరల్:** ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ. 81.27 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ భద్రాజీ తెలిపారు. మంగళవారం ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. 89 రోజులకు గానూ రూ.81,27,202 నగదు, అలాగే అన్నదానం హుండీ ద్వారా రూ.74,790 నగదును భక్తులు స్వామివారికి సమర్పించినట్లు ఈఓ పేర్కొన్నారు. వాటితో పాటు 2.8 కిలోల వెండి, 011 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం అందాయన్నారు. 102 అమెరికన్ డాలర్లు, 10 స్కాట్లాండ్ పౌండ్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన 10 దీరమ్స్, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఓమన్ నుంచి 01 రియాల్‌ను భక్తులు స్వామివారికి సమర్పించినట్లు వెల్లడించారు. ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు, పోలీసు సిబ్బంది హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆర్టీసీ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్రసేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

### పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి

**తాడిపత్రి:** బడి మానేసిన పిల్లలను వంద శాతం బడిలో చేర్పించాలని డీఈఓ వరలక్ష్మి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ నాగరాజు, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, కేజీబీవీ ఎస్‌ఓ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సెక్రటరీలు, సీఆర్పీల సమావేశం నిర్వహించారు. విద్య, పాఠశాల విధి విధానాలపై డీఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో బాధ్యతాయుతంగా పర్యటించి పిల్లలను బడిలో చేర్చాలని సూచించారు. తల్లిదండ్రులకు విద్యా ప్రాముఖ్యతను వివరించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వంద శాతం ఉండాలన్నారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పరిఢవిల్లేలా..

చెట్లు మానవాళికి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఒక్క ప్రాణవాయువే కాదు.. అనేక లాభాలు చెట్ల ద్వారా మానవులకు ఒనగూరుతాయి. జీవ వైవిధ్య పరిరక్షణలో చెట్ల పాత్ర అత్యంత కీలకం. అయితే, తగినంత విస్తీర్ణంలో చెట్లు ఉంటేనే ఇదంతా సాధ్యపడుతుంది. ఏ ప్రాంతంలోనైనా సాధారణంగా 33 శాతం పచ్చదనం ఉండాలి. కానీ, జిల్లా విస్తీర్ణంలో ఆ మేర పచ్చదనం లేదు. దీన్ని గుర్తించిన జిల్లా యంత్రాంగం మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని నిర్ణయించింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో టెక్నాలజీని ఇందులో భాగం చేస్తోంది. ప్రజలూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తోంది.

- హరిత 'అనంత' సాధన దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు
- జిల్లావ్యాప్తంగా లక్ష మొక్కలు నాటేలా ప్రణాళిక
- అటవీశాఖ నర్సరీలో 10 లక్షల మొక్కలు సిద్ధం
- రాయదుర్గం నర్సరీలో 50 వేల మొక్కలు అందుబాటులో..



ఎస్‌ఎస్‌పీ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న జెడ్పీ సీఈఓ నిదియాదేవి (ఫైల్)



అటవీ శాఖ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

**అనంతపురం అర్బన్:** జిల్లాను హరిత 'అనంత'గా మార్చే కార్యక్రమానికి కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శ్రీకారం చుట్టారు. అధికార యంత్రాంగానికి ఇప్పటికే దీనిపై ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో 7.5 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచేలా లక్ష్యం విధించారు. జిల్లావ్యాప్తంగా ఈ వర్షాకాలంలో లక్ష మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే అటవీశాఖ నర్సరీలో 10 లక్షలు, రాయదుర్గం సమీపంలోని నర్సరీలో 50 వేల మొక్కలు సిద్ధం చేశారు.

**మొక్కలు ఎక్కడెక్కడ నాటుతారంటే..**

గ్రామాలు, పట్టణాల్లో అవెన్యూ (రోడ్లకు ఇరు వైపులా) ప్లాంటేషన్ 100 కిలోమీటర్ల మేర చేపట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ భూములు, వృథాగా ఉండే స్థలాలు, దేవదాయ భూములు, గుట్టలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణాల్లో మొక్కలు నాటుతారు. అదే విధంగా ప్రజలు తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నారు.

**చెట్టుతో అనుబంధం పెంచేలా...**

చెట్టుతో మనిషికి అనుబంధం పెంచేలా కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ప్రతి ఒక్కరూ మొక్కను నాటాక దాన్ని సంరక్షించే బాధ్యత కూడా తీసుకునేలా చేస్తారు. ముందుగా మొక్క నాటిన వ్యక్తులతో సంరక్షిస్తామని ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఒక మొబైల్ యాప్ రూపొందిస్తున్నారు. మొక్క నాటినప్పుడు సెల్ఫీ తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేయడం, సంరక్షణలో భాగంగా మొక్కకు రోజూ నీరు పోస్తున్నప్పుడు సెల్ఫీ తీసుకుని అందులో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలా ప్రజలను భాగస్వాములను చేసి కార్యక్రమం విజయవంతం చేయనున్నారు.

**యజ్ఞంలా మొక్కల పెంపకం**



జిల్లాలో పచ్చదనం పెంపొందించి హరిత అనంతగా మార్చే లక్ష్యంగా మొక్కల పెంపకాన్ని యజ్ఞంలా చేపట్టనున్నాం. ఈ వర్షాకాలంలో లక్ష మొక్కలు నాటుతాం. నాతో మొదలు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దత్తత తీసుకుని సంరక్షించాలి. అధికార యంత్రాంగం చేపడుతున్న ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

**మొత్తం 42 జాతుల మొక్కలు..**

నేరేడు, జామ, సపోటా, బాదాం, సీతాఫలం, మామిడి, చింత, వేప, కానుగ, అశోక, నిమ్మ, టేకు, కరివేపాకు, ఉసిరి, నీలగిరి, ఎర్ర చందనం, రావి, మునగ, మారేడు, మేడి, రోజ్‌వుడ్ తదితర 42 జాతుల మొక్కలు నాటాలని నిర్ణయించారు. సామాజిక అటవీశాఖ పరిధిలోని నర్సరీలో 42 జాతులకు సంబంధించి 10,08,771 మొక్కలు, రాయదుర్గం నర్సరీ (ఎస్‌ఆర్‌ఈజీఏ)లో 50 వేల మొక్కలు సిద్ధంగా ఉంచారు.

### వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



జెమిని రమేష్ (ఫైల్)

**గుంతకల్లు:** వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లులోని తిలక్‌నగర్‌కు చెందిన వీఎస్‌ఆర్ మూర్తి అలియాస్ జెమిని రమేష్ (49)కు భార్య రమ్యతో పాటు ఇంటర్ చదువుతున్న జైకిషన్, కూతురు అక్షయ ఉన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో జెమిని సెల్ వర్ల్డ్ పేరుతో దుకాణం ఏర్పాటు చేసుకుని సెల్‌ఫోన్ల విక్రయంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యాపారం, ఇతర అవసరాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. సకాలంలో అప్పులు చెల్లించలేకపోవడంతో వడ్డీల భారం పెరిగింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడుతుండేవాడు. ఈ క్రమంలోనే వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. తరచూ దుర్భాషలాడుతుండడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆయన మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న రమ్య.. ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతున్న భర్తను చూసి కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని రమేష్‌ను కిందకు దించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రెండో పట్టణ సీఐ గణేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# అడుగంటుతున్న రిజర్వాయర్లు

- పీఏబీఆర్, ఎంపీఆర్‌లలో కనిష్ట స్థాయికి నీటిమట్టం
- ప్రస్తుతం నెలన్నర రోజులకు సరిపడా మాత్రమే నీరు
- టీబీ డ్యాం నీటి విడుదల ఆలస్యమైతే తాగునీటికి తప్పని ఇక్కట్లు



పెన్నహోబిలం రిజర్వాయర్

**రిజర్వాయర్లలో నీటి నిల్వ ఇలా...**

| | |
|---|---|
| తుంగభద్ర జలాశయం | 5.370 టీఎంసీలు |
| పీఏబీఆర్ | 0.695 టీఎంసీలు |
| ఎంపీఆర్ | 0.124 టీఎంసీలు |
| సీబీఆర్ | 3.627 టీఎంసీలు |
| చాగల్లు | 0.225 టీఎంసీలు |
| పెండేకల్లు | 0.068 టీఎంసీలు |
| సుబ్బరాయసాగర్ | 000 |

**అనంతపురం సెంట్రల్:** జిల్లాలో రిజర్వాయర్లు అడుగంటుతున్నాయి. రోజురోజుకూ నీటి మట్టం పడిపోతుండడం గుబులు రేపుతోంది. సకాలంలో తుంగభద్ర జలాశయం నుంచి నీరు విడుదల కాకపోతే తాగునీటి ఇబ్బందులు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**టీబీ డ్యాంకు ఈ'సారి'..**

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే నీరే ఆధారం. టీబీ డ్యాం నుంచి వచ్చే నీటిలో దాదాపు సగం తాగు నీటి అవసరాలకు కేటాయిస్తున్నారు. అయితే గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి కేటాయింపులు బాగా తగ్గిపోయాయి. ఈ క్రమంలోనే నీటి అవసరాలు పెరగడంతో జిల్లాలోని రిజర్వాయర్లలో నీరు వేగంగా తగ్గిపోయాయి. ఈ ఏడాది ఇప్పటికీ తుంగభద్ర జలాశయానికి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ప్రస్తుతం 815 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. భారీ వర్షాలు కురిస్తే తప్ప జలాశయం నిండే పరిస్థితి లేదు. ఫలితంగా హెచ్చెల్సీకి నీటి విడుదల కూడా ఆలస్యమయ్యే అవకాశముంది.

**పీఏబీఆర్‌లో 0. 695 టీఎంసీలు మాత్రమే..**

ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని ప్రాంతాలకు పీఏబీఆర్ నుంచే తాగునీరు సరఫరా అవుతోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జిల్లా ప్రజల దాహార్తిని తీర్చడానికి తాగునీటి స్కీములను మంజూరు చేశారు. ఉరవకొండ, గుంతకల్లు, మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం వరకూ పీఏబీఆర్ నుంచే తాగునీరు సరఫరా చేస్తున్నారు. అంతేకాకుండా అనంతపురం నగరానికి ప్రత్యేకంగా వైఎస్ రాజశేఖరరెడ్డి తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా శ్రీసత్యసాయి, ఉరవకొండ తాగునీటి పథకాలు పీఏబీఆర్ రిజర్వాయర్‌పైనే ఆధారపడ్డాయి. ప్రతి సంవత్సరం దాదాపు 10 టీఎంసీల వరకూ రిజర్వాయర్ ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇలాంటి డ్యాంలో ప్రస్తుతం 0.695 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ నీరు నెలన్నర రోజులకు సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. వర్షాల రాక, తుంగభద్ర నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదల ఆలస్యమైతే ఇబ్బందులు తప్పవంటున్నారు. ఇక.. ధర్మవరం, పుట్టపర్తి ప్రాంతాలకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం సీబీఆర్‌లో 3.627 టీఎంసీల నీరు ఉంది. దీంతో ఆ ప్రాంతాలకు ఇబ్బంది ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

**నెలన్నర రోజులకు సరిపోతాయి**

పీఏబీఆర్‌లో ప్రస్తుతం 0.695 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ నీరు నెలన్నర రోజులకు సరిపోతాయి. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి జూలై 28 నుంచి నీటిని విడుదల చేయాలని ఇటీవల జరిగిన మొదటి తుంగభద్ర బోర్డు సమావేశంలో నిర్ణయించారు. నీరు విడుదలైన వెంటనే తాగునీటి అవసరాలకు వినియోగిస్తాం.

– రాజశేఖర్, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

# వణికిస్తున్న డయేరియా



రోగులకందుతున్న సేవలపై ఆరా తీస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వర రావు

**అనంతపురం కార్పొరేషన్:** జిల్లా ప్రజలను అతిసార వ్యాధి (డయేరియా) వణికిస్తోంది. జీజీహెచ్‌లో కేసులు పెరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం 16 మంది డయేరియా బాధితులు ఉండగా.. మంగళవారానికి ఆ సంఖ్య 60కి చేరింది. వీరంతా అనంతపురం అర్బన్, తాడిపత్రి, ఉరవకొండ, కదిరి తదితర ప్రాంత వాసులు కావడం గమనార్హం. రోగులకు అందుతున్న సేవలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వర రావు పరిశీలించారు. డయేరియా బాధితులను సాధ్యమైనంత వరకు ఏదో ఒక యూనిట్‌లోనే ఉంచాలని హెచ్‌ఓడీలు డాక్టర్ భీమసేనాచార్, రవికుమార్‌కు సూచించారు. డయేరియా కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓఆర్‌ఎస్, ఐవీ ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట ఆర్‌ఎంఓ డాక్టర పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, తదితరులున్నారు.

**డయేరియాతో వివాహిత మృతి**



రేణుక (ఫైల్)

**పామిడి:** మండలంలోని రామగిరి ఎగువతండా గ్రామానికి చెందిన బీ అజయ్ నాయక్ భార్య రేణుక (22) మంగళవారం డయేరియాతో మృతి చెందింది. కొన్నిరోజులుగా ఆమెకు తీవ్ర వాంతులు, విరేచనాలు అవుతుండడంతో కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలోనే చికిత్స ఫలించక మంగళవారం ప్రాణాలు విడిచింది. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. డయేరియాతో 5 రోజుల క్రితం గ్రామవాసి పెద్దమ్మ (60) చనిపోయింది. తల్లి మరణాన్ని జీర్ణించుకోలేక అదే రోజు ఆమె కుమారుడు రాముడునాయక్ (35) సైతం ప్రాణాలు విడిచారు. ఈ ఘటన మరువకనే రేణుక మృతి చెందడంతో గ్రామస్తులు భయకంపితులవుతున్నారు. ఇప్పటికీ ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# భార్య ఒడిలోనే శాశ్వత నిద్ర

- బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున ఆకస్మిక మృతి
- నివాళులర్పించిన జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్ర
- అండగా ఉంటామని కుటుంబసభ్యులకు భరోసా



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్ర (ఇన్‌సెట్‌లో) మల్లికార్జున (ఫైల్)

**అనంతపురం సిటీ/బత్తలపల్లి:** జీవితాంతం తోడుంటాడనుకున్న భర్త.. తన ఒడిలోనే ప్రాణాలొదలడంతో ఆ ఇల్లాలు గుండెలవిసేలా రోదించింది. భర్త శిరస్సును గుండెలకు హత్తుకుని 'దేవుడా! ఎంత పనిచేశావయ్యా...' అంటూ బోరున విలపించింది. అనంతపురంలోని కోవూరు నగర్‌లో మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది.

**మళ్లీ రాని లోకానికి మల్లికార్జున**

బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున (51) ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్యతో పాటు ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడేళ్ల క్రితం బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన అనంతపురంలో నివాసముంటూ రోజూ విధులకు వచ్చిపోయేవారు. గతంలో కదిరి, శింగనమల మాజీ ఎమ్మెల్యేలు జొన్నా సూర్యనారాయణ, యామిని బాల వద్ద పీఏగా ఆయన పనిచేశారు. కొన్ని రోజుల పాటు డిప్యూటేషన్‌పై జెడ్పీ పూర్వ సీఈఓ భాస్కరరెడ్డి వద్ద సీసీగానూ పనిచేశారు. తర్వాత డిప్యూటేషన్ రద్దు చేసుకుని బత్తలపల్లి కార్యాలయంలో విధులకు హాజరవుతూ వచ్చారు. సోమవారం విధులు ముగించుకున్న అనంతరం ఇంటికి చేరుకున్న ఆయన అదే రోజు రాత్రి అస్వస్థతకు గురైనట్లు బంధువులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఆయన గుండె పట్టుకున్నట్లుగా ఉందంటూ భార్యతో చెబుతూ ఆమె ఒడిలోనే తల పెట్టుకుని సేదతీరారు. ఎంతసేపు పిలిచినా స్పందన లేకపోవడంతో కుటుంబసభ్యులు పరిశీలించి, గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.

**పదోన్నతి కోసం తిరుగుతూ..**

సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మల్లికార్జున మరో వారంలో పదోన్నతి పొందాల్సి ఉందని జెడ్పీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలోనే ఆయన గుండెపోటుతో ప్రాణాలొదలడం జెడ్పీ ఉద్యోగులందరినీ కలచివేసింది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనంతపురంలోని మల్లికార్జున స్వగృహానికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అందరినీ అన్నా.. అక్కా.. అంటూ ఆప్యాయంగా పలకరించే వాడని గుర్తు చేశారు. నిబద్ధత కలిగిన ఒక ఉద్యోగిని జిల్లా పరిషత్ కోల్పోవడం బాధాకరమన్నారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె వెంట అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, జెడ్పీ ఉద్యోగులు, బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. అలాగే, బత్తలపల్లి ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, బీజేపీ నాయకులు కోటి సూర్యప్రకాష్‌బాబు, టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్పతో పాటు ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఈఓఆర్డీ దివాకర్, సూపరింటెండెంట్ శ్రీదేవి సంతాపం వ్యక్తం చేశారు.



## ఉత్సాహంగా ఉట్లపరుష

**బెళుగుప్ప:** మండల కేంద్రంలోని శాంతిధామంలో మంగళవారం ఉట్ల పరుష ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. అవధూత శ్రీ ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఉట్లోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తజనం తరలివచ్చారు. ఉట్ల మాను ఎక్కేందుకు యువకులు పోటీ పడ్డారు. బురద మయమైన స్తంభాన్ని ఎక్కేందుకు వారు పడిన పాట్లు నవ్వులు పూయించాయి. ఉట్లోత్సవం అనంతరం భక్తులు ఎర్రితాతస్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

## క్లుప్తంగా

### వివాహిత బలవన్మరణం

బ్రహ్మసముద్రం: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం పొబ్బర్లపల్లికి చెందిన హరిజన ఆదిమూర్తికి ఐదేళ్ల క్రితం కర్ణాటక ప్రాంతానికి చెందిన చైత్ర (25)తో వివాహమైంది. అప్పటికే ఆమె కడుపు నొప్పితో బాధపడుతుండేది. దీంతో తల్లిదండ్రులు చిత్రదుర్గలో చికిత్స చేయించారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న చైత్ర మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న బ్రహ్మసముద్రం ఎస్‌ఐ పరుశురాముడు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

### 28న ఐటీఐలో జాబ్‌మేళా



అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈ నెల 28న ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్‌గా ఐటీఐ ఉత్తీర్ణులైన వారు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఆసక్తి ఉన్న వారు శుక్రవారం జరిగే జాబ్ మేళాకు బయోడేటాతో పాటు మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, ఫొటోలు, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రం రెండేసి సెట్లు చొప్పున వెంట తీసుకురావాలి. పూర్తి సమాచారానికి 88868 85173లో సంప్రదించవచ్చు.

### డిగ్గర్ ట్రాక్టర్ రాడ్ తగిలి జార్ఖండ్ వాసి మృతి



మృతుడు సురేష్

కణేకల్లు: పని ప్రాంతంలో డిగ్గర్ ట్రాక్టర్‌రాడ్ తగిలి వలస కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... జార్ఖండ్‌కు చెందిన పలువురు వలస వచ్చి విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో డి.హొన్నూరులో కొత్తగా నిర్మాణంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు 33 కేవీ లైన్ లాగే పనులు చేపట్టారు. మాల్యం శివారులో మంగళవారం సాయంకాలం ముందుగానే తీసిన గోతిలో జార్ఖండ్‌కు చెందిన సురేష్(55) డిగ్గర్ ట్రాక్టర్ సాయంతో కరెంటు పోల్ పాతిపెట్టిస్తున్నాడు. కరెంటు పోల్‌ను లిఫ్ట్ చేసి గుంతలో దించే సమయంలో ఒక్కసారిగా పెనుగాలి వీచింది. ఆ సమయంలో ట్రాక్టర్ రాడ్‌ సురేష్ తలకు తగలడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సహచరులు వెంటనే కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

# కలెక్టరేట్‌లో జీటీఎస్



- 1922లో ఏర్పాటు చేసిన బ్రిటీష్ ప్రభుత్వం
- స్టాండర్డ్ బెంచ్ మార్క్ 1952గా గుర్తింపు
- దీని ఆధారంగానే జిల్లాలో ఏ సర్వే అయినా...

మీకు తెలుసా?

### బ్రిటీష్ ప్రభుత్వ ప్రాజెక్టు

జీటీఎస్ అంటే 'గ్రేట్ ట్రిగ్నామెట్రికల్ సర్వే' అని అర్థం. ఈ పాయింట్‌ను 1922లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ సర్వే జనరల్ ఆఫ్ ఇండియా (కలెక్టర్ కార్యాలయం) ఇక్కడ స్థాపించింది. భారత ఉపఖండం అంతటా శాస్త్రీయ కచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహించాలనే లక్ష్యంతో అప్పట్లో బ్రిటీష్ ప్రభుత్వంగ్రేట్ ట్రిగ్నామెట్రికల్ (త్రికోణమితి) సర్వే ఆఫ్ ఇండియా ప్రాజెక్టును రూపొందించింది. దీనిని 1802లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో బ్రిటీష్ పదాతిదళ అధికారి విలియం లాంబ్టన్ ప్రారంభించారు. ఆయన వారసుడు 'జార్జ్ ఎవరెస్ట్ అండ్రూ స్కాట్ వా' నాయకత్వంలో ఈ ప్రాజెక్ట్ సర్వే ఆఫ్ ఇండియాకు బాధ్యత వహించింది. ఎవరెస్ట్ ఆండ్రూ స్కాట్‌వా ( 1861) తర్వాత ఈ ప్రాజెక్టు జేమ్స్ వాకర్ నేతృత్వం వహించి 1871లో పూర్తి చేయించారు.

అనంతపురం అర్బన్: కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని వెనుక భాగంలో చతురస్రాకారంలో ఉన్న రాతి దిమ్మె దర్శనమిస్తుంది. దాని మీద 'జీటీఎస్ స్టాండర్డ్ బెంచ్ మార్క్ 1952' అనే అక్షరాలు కనిపిస్తాయి. అయితే ఆ రాతి దిమ్మె ఏమిటి.... అక్కడ ఎందుకు ఏర్పాటు చేశారు... దాని మీద ఉన్న అక్షరాలు దేనికి సంకేతం... అనేది దాదాపు ఎవరికీ అంతు చిక్కని ప్రశ్నగానే మిగిలిపోతోంది. చూసిన వారిలో కొందరు తెలుసుకునే ప్రయత్నం చేసినా తెలుసుకోలేకపోయారు.

**ఉపయోగం ఏమిటి?**

జిల్లాలో ఎయిర్ పోర్టులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రభుత్వ కట్టడాలను నిర్మించాల్సి వచ్చినప్పుడు ఆ ప్రదేశం సముద్రమట్టానికి ఎంత ఎత్తులో ఉందనే అంశాన్ని గుర్తించేందుకు సర్వే చేస్తారు. ఇందు కోసం జీటీఎస్ పాయింట్‌ను ఆధారంగా చేసుకుని సర్వే చేస్తారు. జిల్లాలో ఏదేని సర్వే చేయాలన్నా కలెక్టరేట్‌లోని జీటీఎస్ ఆధారంగానే మొదలు పెడుతుంటారు.


### త్రికోణాలతో దేశం మొత్తం కలుపుతూ

భారతదేశంలోని బ్రిటీష్ భూభాగాలను గుర్తించడం, హిమాలయాలు, ఎవరెస్ట్, కే1, కాంచనజంగా తదితర పర్వత శ్రేణుల ఎత్తును కొలవడంలో జీటీఎస్ నివేదిక కచ్చితత్వాన్ని కలిగి ఉండడంతో దీనిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. ఇది రేఖాంశ విభాగంలో మొదట కచ్చితమైన కొలతలతో ఒకదానికి, ఐసోస్టాసీ సిద్ధాంతాల అభివృద్ధికి దారితీసిన జియోడెసిక్ అసాధారణ కొలతలతో సరితూగుతోంది. రేఖాంశాల ప్రకారం కన్యాకుమారి నుంచి జమ్మూకాశ్మీర్ వరకూ దేశం మొత్తాన్ని తూర్పు నుంచి పడమరకు... దక్షిణం నుంచి ఉత్తరానికి త్రికోణాలతో కలుపుతూ వచ్చారు. ఈ క్రమంలో త్రికోణ మూలలు కలిసే చోట జీటీఎస్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తూ వచ్చారు. కేవలం అనంతపురంలోని కలెక్టరేట్‌లోనే కాకుండా బుక్కరాయసముద్రం కొండ మీద, గుత్తి కోటపై, తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి జీటీఎస్ పాయింట్లు ఉన్నట్లు సమాచారం. కలెక్టరేట్‌లోని జీటీఎస్ పాయింట్‌కు స్టాండర్డ్ బెంచ్ మార్క్ 1952గా గుర్తింపునిచ్చారు.





కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న జీటీఎస్ రాతి దిమ్మె



దేశానికి సంబంధించి గ్రేట్ ట్రిగ్నామెట్రికల్ (తికోణమితి) సర్వే మ్యాప్

**చాలా ప్రాధాన్యత ఉంది**

జీటీఎస్ పాయింట్‌కు చాలా ప్రాధాన్యత ఉంది. ఎంతో వ్యయప్రయాసల కోర్చి దేశం మొత్తాన్ని గ్రేట్ ట్రిగ్నామెట్రికల్ సర్వే అఫ్ ఇండియా త్రికోణమితి సర్వే చేసింది. జిల్లా ఏదేని ప్రధాన నిర్మాణం కోసం సర్వే చేయాల్సి వచ్చినప్పుడు కలెక్టర్ కార్యాలయంలోని జీటీఎస్‌ను ఆధారంగా చేసుకుని సర్వే ప్రారంభిస్తాం.

– రూప్లానాయక్, ఏడీ, సర్వేశాఖ

### 8 నుంచి రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ కాకినాడ వేదికగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు మంగళవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సీపీఐ జిల్లా కార్యాలయంలో విడుదల చేసి ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు రాజకీయ పరిణామాలపై అవగాహన, ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. సమాజం, విద్యా వ్యవస్థలో దాగున్న అవినీతిని వెలికి తీయడానికి, అవినీతి... అక్రమార్కులపై పోరాటాలు చేయడానికి ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, సామాజిక, ఆర్థిక,రాజకీయ పరిస్థితులపై విద్యార్థులను చైతన్య పరచనున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం కొనసాగించాలన్నారు. పీజీ విద్యార్థులకు కామన్ ఎంట్రన్స్ పరీక్ష రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి, నాయకులు హనుమంతు, నరసింహయాదవ్, వెంకట్‌నాయక్, ఆంజనేయులు, వంశీ పాల్గొన్నారు.

# రూ.231 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ జమ

- త్వరలో రూ.22 కోట్ల మిస్ మ్యాచింగ్ సొమ్ము విడుదల
- వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ



అనంతపురం అగ్రికల్చర్: వర్షాభావం కారణంగా గతేడాది 2023 ఖరీఫ్‌కు సంబంధించి ఇటీవల ఎన్నికల తర్వాత రూ.253 కోట్లు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) విడుదల కాగా అందులో రూ.231 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ అయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. 2023లో వర్షాభావం వల్ల అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కరువు జాబితాలో 28 మండలాలను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. 28 మండలాల పరిధిలో 1.80 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో 1.70 లక్షల మంది రైతులకు రూ.253 కోట్లు ఇన్‌పుట్ వచ్చినట్లు తెలిపారు. బ్యాంకు అకౌంట్, రైతు పేర్లు, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్, అకౌంట్ ఇనాక్టివ్, ఇతర వివరాలు తప్పుగా నమోదై మిస్‌మ్యాచింగ్ జాబితాలో ఉన్న రూ.22 కోట్లకు సంబంధించి మరోసారి రైతుల నుంచి అన్ని డాక్యుమెంట్లు తీసుకుని ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఇలాంటి కారణాలతో ఇంకా 13,400 మంది రైతులకు ఇన్‌పుట్ సొమ్ము జమ కావాల్సి ఉందన్నారు. ఇది కూడా త్వరలోనే వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**ఇంకా 10 వేల హెక్టార్లు**

ఈ ఖరీఫ్‌లో 3.46 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేశామన్నారు. ఈ నెల మొదటి పక్షంలో కురిసిన వర్షాలకు అక్కడక్కడ ముందస్తుగా పంటలు వేశారన్నారు. రెండు రోజుల కిందట అందిన సమాచారం మేరకు 10 వేల హెక్టార్లలో పంటలు సాగు చేయగా అందులో వేరుశనగ 4,500 హెక్టార్లు, కంది 1,550 హెక్టార్లు, ఆముదం 900 హెక్టార్లు కాగా సజ్జ, రాగి, జొన్న, మొక్కజొన్న, పత్తి, పొద్దుతిరుగుడు తదితర పంటలు కూడా సాగు చేసినట్లు తెలిపారు. ఖరీఫ్‌లో ప్రదాన పంటల సాగు చేసుకునేందుకు జూలై 15 వరకు అదను కాగా... కొంచెం ఆలస్యమైనా జూలై ఆఖరు వరకు ఇబ్బంది ఉండదన్నారు. ఆ తర్వాత ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాలన్నారు. వర్షాలు పడే సూచన ఉన్నందున గడువులోపే సాధారణ సాగు విస్తీర్ణం రావచ్చన్నారు. ఇక జిల్లాకు కేటాయించిన 76 వేల క్వింటాళ్ల వేరుశనగలో ఇప్పటికే 40 శాతం రాయితీతో 75 వేల క్వింటాళ్ల వరకు పంపిణీ పూర్తయిందన్నారు. 50 శాతం రాయితీతో 428 మంది రైతులకు 140 క్వింటాళ్లు పచ్చిరొట్ట విత్తనాలు, 2,675 మంది రైతులకు 30 శాతం రాయితీతో 375 క్వింటాళ్ల విత్తన కందులు ఇచ్చామన్నారు. కేటాయించిన మేరకు విత్తన పంపిణీ ఇంకా కొనసాగిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అవసరమైన మేరకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో పెట్టామన్నారు. కల్తీ, నాసిరకం, నిషేధిత విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలపై గట్టి నిఘా ఉంచామని తెలిపారు. రైతు భరోసా, పంటల బీమా తదితర పథకాలకు సంబంధించి ఇంకా ఎలాంటి సమాచారం లేదన్నారు. జూలై 15 తర్వాత ఈ-క్రాప్ ప్రక్రియ మొదలు కావచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో ఏడీఏ, ఏఓ, ఏఈఓ, ఆర్‌బీకే అసిస్టెంట్లను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

# జగన్ సీఎం కాలేదన్న వేదనతో ఇద్దరి మృతి

జగన్ సీఎం కాలేదన్న వేదనతో ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి చెందారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం మనోవేదనతో ఆస్పత్రి పాలైన వారు చికిత్సకు స్పందించక మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.





షఫీ (ఫైల్), మృతుడు పెద్దరంగప్ప

కంబదూరు: మండలంలోని అచ్చంపల్లికి చెందిన షఫీ (51) వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేసేవాడు. వైఎస్ జగన్ అంటే వల్లమాలిన అభిమానం ఉన్న ఆయన రెండో సారి తన అభిమాన నేత సీఎం కాలేకపోయాడన్న బాధతో ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి నిద్రాహారాలు మానేశాడు. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. అయితే పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి ఆయన మృతి చెందారు. మంగళవారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, వైస్ ఎంపీపీ భీమేష్, నాయకులు బాబురెడ్డి, మల్లారెడ్డి, భీమప్ప తదితరులు షఫీ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోరంట్ల: మండలంలోని గోపిదేవరపల్లికి చెందిన ఆవులపెద్ద రంగప్ప(65)కు వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే ఎంతో అభిమానం. అదే అభిమానాన్ని వైఎస్ జగన్‌పై కూడా ఆయన పెంచుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక కుమిలిపోయాడు. నిద్రాహారాలు మానేసి అస్వస్థతకు గురైన ఆయన మంగళవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రకటించారు. అలాగే రంగప్ప మృతదేహానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### తప్పిపోయిన తల్లి కుటుంబసభ్యుల చెంతకు



తల్లిని కుమారుడు గురుశేఖర్‌కు అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కుమార్

ధర్మవరం అర్బన్: తప్పిపోయిన తల్లిని కుటుంబ సభ్యుల చెంతకు ధర్మవరం రైల్వే పోలీసులు చేర్చారు. ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ బోయ కుమార్ తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా తాటిగుంటపాళ్యానికి చెందిన 60 ఏళ్ల రెడ్డమ్మ నాలుగేళ్ల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా రైలు ఎక్కి వెళ్లిపోయింది. ఘటనపై అప్పట్లో ఆమె కుమారుడు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే ఆమె ఫొటోతో కూడిన కరపత్రాలను రైల్వేస్టేషన్లు, బస్టాండ్ ప్రాంతాల్లో అతికించాడు. ఈ నెల 24న తిరుపతి – గుంతకల్లు ప్యాసింజర్ రైలులో తన తల్లి ప్రయాణిస్తున్నట్లు సమాచారం అందుకున్న గురుశేఖర్ వెంటనే రైల్వే పోలీసులను సంప్రదించాడు. రైలు ధర్మవరం స్టేషన్‌కు చేరుకోగానే బోగీలను ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కుమార్, సిబ్బంది గాలించి రెడ్డమ్మను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విషయాన్ని గురుశేఖర్‌కు తెలపడంతో మంగళవారం ఆయన ధర్మవరానికి చేరుకోవడంతో ఆయనకు రెడ్డమ్మను అప్పగించారు.

# ఏపీ పీజీఈసెట్‌లో 'అనంత' ప్రతిభ

- జేఎన్‌టీయూ(ఏ)పరిధిలో 22 మందికి గణనీయమైన ర్యాంకులు
- రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన గణేష్
- సి. శ్రీనాథ్‌కు 32, కె.జాహ్నవికి 57వ ర్యాంకు



గణేష్



శ్రీనాథ్



జాహ్నవి

అనంతపురం: ఏపీ పీజీఈసెట్ ఫలితాల్లో జేఎన్‌టీయూ (ఏ) విద్యార్థులు సత్తా చాటారు. ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు చేపట్టేందుకు ఇటీవల నిర్వహించిన ఏపీ పీజీఈసెట్ -2024 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జేఎన్‌టీయూ (ఏ) ఓటీపీఆర్‌ఐలో బీఫార్మసీ పూర్తి చేసిన 22 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో గణనీయమైన ర్యాంక్‌లు సాధించి, తమ సత్తా చాటారు. ఓటీపీఆర్‌ఐ విద్యార్థి కప్పె గణేష్ రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్‌తో మెరిశారు. అలాగే 32వ ర్యాంక్‌తో చేకూరి శ్రీనాథ్ 57వ ర్యాంక్‌తో కె.జాహ్నవి ప్రతిభ చాటారు. మొత్తం 22 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులు సాధించడంపై ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్‌తో పాటు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేశారు.

**రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన ఓటీపీఆర్‌ఐ విద్యార్థులు వీరే...**

| పేరు | ర్యాంకు | పేరు | ర్యాంకు |
|---|---|---|---|
| కప్పె గణేష్ | 03 | సి.తులసి | 812 |
| చేకూరి శ్రీనాథ్ | 32 | ఎండీ తబస్సుమ్ | 812 |
| కె.జాహ్నవి | 57 | కె.అంచల్ మన్నిత్ | 947 |
| కె. అనిల్‌కుమార్ | 117 | ఎం.కావేరి | 1,082 |
| జె.మౌనిక | 184 | సి.వందన | 1,166 |
| పి.యశ్వంత్ | 211 | డి.ఉదయశ్రీ | 1,358 |
| కె.ఇమ్రాన్ | 268 | ఎం.మనోజ్ | 1,526 |
| ఎ.విజ్ఞత | 302 | సి.ఇందుప్రియ | 1,862 |
| బి.గంగాధర్ | 525 | ఎన్.మురళి | 1,862 |
| టి.సల్మా | 525 | జి.శివాని | 2,198 |
| కె.శ్రావణి | 525 | దినేష్ | 2,198 |
| ఎం.శ్రావణి | 608 | ఎం.కీర్తి | 2,678 |
| జి.లిఖిత్ | 812 | ----------- | ----------- |

### త్రుటిలో తప్పిన ప్రమాదం


బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు సమీపంలో పంట కాలువలోకి ఆటో దూసుకెళ్లింది. అయితే అదృష్టవశాత్తూ ప్రమాదం తప్పింది. మంగళవారం ఉంతకల్లుకు చెందిన 25 మంది విద్యార్థులు ఉద్దేహాల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలకు ఆటోలో వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా, గ్రామ సమీపంలోకి రాగానే ఆటో పంట కాలువలోకి దూసుకెళ్లింది. అయితే విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. కాగా ఘటన జరిగిన తర్వాత డ్రైవర్ పరారయ్యాడు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఆరంభంలోనే కరువు ఛాయ



విత్తు కోసం సిద్ధం చేసిన పొలం

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఉమ్మడి జిల్లాలో కరువు ఛాయలు నెలకొన్నాయి. రోజూ కారు మబ్బులు కనిపిస్తున్నా... వర్షం చుక్క నేల రాలడం లేదు. ధర్మవరం నియోజకవర్గం సంజీవపురం సమీపంలో వేరుశనగ విత్తుకు సిద్ధం చేసుకున్న పొలాలు వర్షం కోసం ఎదురు చూస్తున్నాయి. బత్తలపల్లి సమీపంలో గ్రాసం కోసం ఒట్టి పొలాల్లో వెంపర్లాడుతున్న జీవాలు చివరకు ఆకలి తట్టుకోలేక దొరికింది తిని పొట్ట నింపుకుంటున్నాయి. మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే ఈ ఖరీఫ్ కాలం గట్టెక్కడం కష్టమేనని రైతులు పేర్కొంటున్నారు. – సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం:



గడ్డి కోసం వెదుకుతున్న జీవాలు



రోజూ ఇలాగే ఊరిస్తున్న మేఘాలు

## క్లుప్తంగా

### టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థి వరుణ్‌సాయిని అభినందిస్తున్న స్కూల్ సిబ్బంది

**అనంతపురం రూరల్:** ఈ నెల 15, 16 వతేదీల్లో అనంతపురం పీటీసీ మైదానంలో నిర్వహించిన సౌత్ మినీ సబ్ జూనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. దీంతో నిర్వాహకులు అతడిని సబ్ జూనియర్ ఆంధ్ర జట్టుకు ఎంపిక చేశారు. మంగళవారం విద్యార్థిని న్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన అన్వర్‌బాషా, స్కూల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సెల్వామేరీ మాట్లాడుతూ వరుణ్‌సాయి సబ్ జూనియర్ జట్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్ర జట్టు తరపున రాణించి భవిష్యత్తులో మరింత ముందుకు పోవాలని ఆకాంక్షించారు.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**చెన్నేకొత్తపల్లి:** వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేడాపురం యునాని వైద్యశాల అధికారి డాక్టర్ ఖాదర్ సూచించారు. మేడాపురం దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే తొట్టెల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేయరాదన్నారు. ఇలా చేయడం వలన దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని సూచించారు.

### వైభవంగా కుర్లపల్లయ్య స్వామి ఊరేగింపు



రాప్తాడులో ఊరేగుతున్న కుర్లపల్లయ్య స్వామి

**రాప్తాడు:** మండల కేంద్రంలో మంగళవారం ధర్మపురి కుర్లపల్లయ్య స్వామి ఊరేగింపు వైభవంగా సాగింది. రాప్తాడుకు చెందిన కురుబ కులానికి చెందిన పామాల వంశస్తులు పామాల క్రిష్టప్ప, పామాల లక్ష్మీ దంపతులు తమ ఇంటి ఇలవేల్పు అయిన కుర్లపల్లయ్య స్వామిని శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం ధర్మపురి గ్రామం నుంచి రాప్తాడుకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామిని రాప్తాడుకు తీసుకురావడంతో కాపులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయడంతోపాటు రోజు రాత్రంతా గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపును తిలకించేందుకు మండలం నుంచే గాక ఇతర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. యువతులు, మహిళలు ప్రతి ఇంటి నుంచి స్వామి వారికి బిందెలతో నీళ్ళు పోసి మొక్కులను తీర్చుకున్నారు.

### మొక్కల పెంపకం అందరి బాధ్యత



యోగా గురువును సత్కరిస్తున్న కవి టీవీ రెడ్డి తదితరులు

**అనంతపురం కల్చరల్:** పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడుతున్న యోగా గురువు హనుమంతును కవులు, సామాజిక సేవా కార్యకర్తలు మంగళవారం ఘనంగా సత్కరించారు. తెలుగు వెలుగు సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు, కవి టీవీరెడ్డి పిరమిడ్ యోగా గురువు హనుమంతు స్ఫూర్తితో వందలాది ఇళ్లకు ఉచితంగా పూల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా విచ్చేసిన యోగా గురువు హనుమంతు మాట్లాడుతూ సమాజాన్ని సస్యశ్యామలం చేస్తేనే కరువు ఆమడ దూరం పారిపోతుందని, నాగరికత తెస్తున్న మార్పులు వాతావరణాన్ని సమూలంగా నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి ముందు విరివిగా మొక్కలు నాటడం, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవడం బాధ్యతగా స్వీకరించాలన్నారు. కవులు, సాహితీవేత్తలు పర్యావరణ పరిరక్షణను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం హనుమంతును సత్కరించి ఆయన బాటలో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మస్తానప్ప, లక్ష్మీదేవి, మురళీకృష్ణారెడ్డి, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జేడీఏ కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు



రికార్డులు భద్రపరిచిన గది కిటికీలు ఇలా...

# ఎటు చూసినా చెత్తే!

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లా వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ ఆవరణలో ఎక్కడా చూసిన చెత్తాచెదారం, కలుపు మొక్కలు, పాత వస్తువులతో కంపుకొడుతోంది. పరిశుభ్రత పనులు చేపట్టని కారణంగా చెత్తదిబ్బలుగా మారిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కుళ్లిపోవడంతో దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమల వ్యాప్తి పెరిగింది. చిన్నపాటి వర్షం వచ్చినా ముక్కు మూసుకుని పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయ గోడలు నెర్రెలు చీలి ఎక్కడిక్కడ నీళ్లు ఇంకిపోవడంతో పాచి పట్టింది. పాతబడిన కుర్చీలు, టేబుళ్లు, కంప్యూటర్ సామగ్రి, వైర్లు, టైర్లు ఎక్కడపడితే అక్కడ పెట్టడంతో దోమలు బెడద అధికమైంది. పాత ఫైళ్లు భద్రపరిచిన ఒక గదిని చూస్తే పరిస్థితి ఎంత అధ్వానమనేది ఇట్టే అర్థమవుతుంది. జేడీఏతో పాటు టెక్నికల్ ఏవోలు, ఇతర క్లరికల్ స్టాఫ్, అటెండర్లు, వాచ్‌మెన్లు... దాదాపు 50 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఒక ప్రధాన ప్రభుత్వ కార్యాలయం ఇంత అధ్వానంగా ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.




వ్యవసాయశాఖ జేడీ కార్యాలయం



కార్యాలయం ముందు దిష్టిబొమ్మలా ఉన్న తుప్పు పట్టిన జీపు



లీకేజీతో శిథిలావస్థకు చేరుకున్న కార్యాలయం గోడ

# నిత్యావసరాల ధరలు తగ్గించాలి

**అనంతపురం అర్బన్:** పెరుగుతున్న నిత్యావసర, కూరగాయల ధరలు తగ్గించాలంటూ సీపీఎం నాయకులు, మహిళలు మంగళవారం స్థానిక టవర్ క్లాక్ వద్ద కూరగాయల దండలు మెడలో వేసుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ నిత్యావసర, కూరగాయల ధరలను నియంత్రించడాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా పాలన చేస్తున్నా నిత్యావసర సరుకుల ధరలను అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. పెట్టుబడిదారులకు ఊడిగం చేయడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కూరగాయలు ధరలు చూస్తే రైతులు పంట పండినప్పుడు ధరలు అడుక్కు పడిపోతాయన్నారు. పంటలను కొనే వారు లేక వాటిని రోడ్ల పక్కన పడేసిన సందర్భాలు కోకొల్లలన్నారు. ప్రతి పంటకు ధరను ప్రభుత్వం ముందుగానే నిర్ణయించాలన్నారు. రైతుల నుంచి కూరగాయలను ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతు బజార్ల ద్వారా ప్రజలకు విక్రయించాలన్నారు. రైతులను దగా చేస్తున్న దళారులను కఠినంగా శిక్షించాలన్నారు. ధరలను తగ్గించే విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు వెంకటనారాయణ, ప్రకాశ్, వలి, బాలకృష్ణ, మసూద్, శీనా, ఎర్రిస్వామి, నూరుల్లా, లాలెమ్మ, మాబ్బీ, గులాబ్, తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల దండలతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

# కార్పొరేట్ విద్యాసంస్థలకు తొత్తుగా ఆర్ఐఓ

- ఆర్ఓఐ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

**అనంతపురం ఎడ్యుకేషన్:** కార్పొరేట్ విద్యాసంస్థలకు తొత్తుగా మారిన ఇంటర్ బోర్డ్ ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్బీ, బీసీ ఎస్టీ ఎస్సీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య, వీఎస్ఐవీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఏఐఎస్బీ జిల్లా కార్యదర్శి పృథ్వీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సురేష్, వీఎస్ఐవీ జిల్లా కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ కరువుకు నిలయమైన అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థల విద్య మాఫియా రోజురోజుకు పెరిగిపోతోందన్నారు. గతంలో ఉన్న ఫీజులకంటే ఈసారి 50 శాతం అదనంగా పెంచారన్నారు. కళాశాలల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలు వేల రూపాయలకు విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయాలు తెలిసినా ఆర్ఐఓ చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మౌలిక వసతులు కల్పించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా ఆర్ఐఓ నిద్రమత్తులో ఉన్నారని మండిపడ్డారు. అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై కలెక్టర్ స్పందించాలని కోరారు. ప్రత్యేక ఫీజుల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న ఓ కార్పొరేట్ కళాశాల దగ్గరికి వెళ్లి ఆర్ఐఓ కార్యాలయ సిబ్బంది ద్వారా పుస్తకాల గదికి తాళం వేయించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు హనుమంతు, నరసింహయాదవ్, అంజి, వెంకటరమణ నాయక్, ఉమా, వంశీ, సిద్దు, శివా, చంద్ర, సోము, లక్ష్మీపతి నాయక్, హరీష్, ఆనంద్, బాబు, నవీన్ పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

# భక్తిశ్రద్ధలతో వినాయక వ్రతం



పాతూరులో పూజలందుకున్న వినాయకుడు



ముత్యాలమ్మ ఆలయంలో అలంకరణలో విఘ్నేశ్వరుడు

**అనంతపురం కల్చరల్:** పూజలందుకునే ఆదిదేవుడు వినాయకుడిని మంగళవారం రాత్రి వందలాది మంది దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సంకష్టహర చతుర్థి సందర్భంగా నగరంలోని పలు ఆలయాలలో సామూహిక వినాయక వ్రతాలు, చతుర్థి పూజలు, ఘనంగా గణపతి హోమాలు జరిగాయి. పాతూరులోని తిలక్‌రోడ్డులో వినాయకుడికి మోదకాలతో అలంకారం చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గీతామందిరంలో సహస్రమోదక గణపతి హోమం శాస్త్రోక్తంగా సాగింది. వేర్వేరు చోట్ల హోమగుండాలను ఏర్పాటు చేసి రుత్వికులు భక్తులతో గణపతి హోమం జరిపించారు. అలాగే మూడవరోడ్డులోని బాబా మందిరంలో సంకష్టహర పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. స్వామివారికి కుడుముల నైవేద్యం సమర్పించి అనంతరం భక్తులకు వితరణ చేశారు. అదేవిధంగా చెరువుకట్టపై వెలసిన వినాయక ఆలయం, సోమనాథ నగర్‌లోని సంకష్టహర గణపతి ఆలయం తదితర చోట్ల వినాయక వ్రత విశిష్టతను పండితులు తెలియజేశారు. హెచ్చెల్సీకాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో అంగారక వినాయక చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ శేఖరబాబు నేతృత్వంలో స్వామివారికి విశేష అలంకార సేవలు,సామూహిక పూజలు ప్రసాద వితరణ జరిగాయి.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**చెన్నేకొత్తపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ–2 ప్రసన్నకుమార్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. హరియాన్‌చెరువు ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. నిర్ణీత సమయానికి అందరూ పాఠశాలకు తప్పక హాజరు కావాలన్నారు. అనంతరం పాఠశాల తరగతి గదులు, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. భోజనం రుచికరంగా ఉంటుందా లేదా కావాల్సినంత ఇస్తున్నారా లేదా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థులతో భోజన నాణ్యతను తెలుసుకుంటున్న ఎంఈఓ ప్రసన్నకుమార్‌నాయుడు

### కలుషిత నీటితోనే డయేరియా

**ఉరవకొండ:** కలుషిత నీరు తాగడం వల్లే డయేరియా వ్యాప్తి చెందిందని, గుర్తింపు లేని మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి నీరు తీసుకొచ్చి తాగరాదని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ సుజాత అన్నారు. మంగళవారం ఉరవకొండలో జిల్లా ఎపిడమిక్ బృందం పర్యటించింది. పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో నమోదవుతున్న డయేరియా కేసులపై ఈనెల 25న 'సాక్షి'లో 'విజృంభిస్తున్న డయేరియా' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిని జిల్లా ఎపిడిమిక్ బృందం పరిశీలించింది. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, డీపీఎంఓ రవిశంకర్, డాక్టర్ వేమారెడ్డి బృందం ఉరవకొండ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్లోజి, డాక్టర్ సాహితితో కలిసి డయేరియాతో ఆస్పత్రి పాలైన వారితో మాట్లాడారు. వారం రోజుల నుంచి ఎన్ని కేసులు నమోదయ్యాయి?.. ఎంత మందిని డిశార్చ్ చేశారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది డయేరియాతో ఆస్పత్రిలో చేరారో ఓపీ రిజిష్టర్‌ను పరిశీలించారు.

### కలుషిత నీటితోనే అతిసార వ్యాధి వ్యాప్తి



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కూడేరు:** కలుషిత నీటితోనే అతిసార వ్యాధి వ్యాప్తి చెందుతుందని మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి తెలిపారు. మంగళవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా అతిసార, మలేరియా, డెంగీ వ్యాధులపై వారికి వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి అవగాహన కల్పించారు. పిల్లలు, పెద్దలు భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే తాగునీటిని కాచి చల్లార్చి తాగేలా చైతన్య పరచాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రవీంద్ర, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**ఆత్మకూరు:** సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ దశరథరామయ్య అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. ప్రధానంగా పరిసరాలు, నీటి తొట్టెల్లో నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా చైతన్యపర్చాలన్నారు. తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతోపాటు తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశ్వరస్వామి, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్, ఎస్ఓ లీమారోజ్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లదే కీలక పాత్ర

**అనంతపురం క్రైం:** ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లదే కీలక పాత్ర అని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని అన్నారు. మంగళవారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలోని సమావేశం మందిరంలో డ్రైవర్లకు వారం రోజుల పాటు శిక్షణ తరగతులను డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఇంధన పొదుపుతో పాటు ప్రమాదాల నియంత్రణకు ప్రతి డ్రైవరు కృషి చేయాలన్నారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఆర్టీసీ ఖర్చులో 30 శాతం ఇంధనానికి అవుతోందన్నారు. ఇంధనం మీద ఖర్చు తగ్గించాలంటే డ్రైవర్లకు మెలుకువలు చాలా అవసరమన్నారు. డ్రైవర్లకు ఉదయం శిక్షణ మధ్యాహ్నం ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. ప్రతి డ్రైవరు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

**గుత్తి:** పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మామిళ్లపల్లికి చెందిన కృష్ణయ్య తన స్నేహితునితో కలసి బైక్‌లో గాంధీ సర్కిల్ వైపు వెళ్తుండగా సినిమా థియేటర్ వద్ద వెనుక నుంచి ఆటో బైక్‌ను ఢీ కొనింది. ప్రమాదంలో కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కృష్ణయ్య స్నేహితుడు ఆటో డ్రైవర్‌ను చితకబాదాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### ఆక్రమణలు తొలగిస్తాం



సక్షన్ ఆపరేటర్ మిషన్ ద్వారా పూడిక, వ్యర్థాలను తీస్తున్న దృశ్యం

**అనంతపురం కార్పొరేషన్:** కాలువలపై నిర్మాణాలు చేపట్టడం ద్వారా మురుగు బ్లాక్ అయి, రివర్స్‌లో వెళ్లే ప్రమాదం ఉందని, కాలువలపై నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, ఏసీపీ మారుతిహరి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం 39వ డివిజన్‌లో వారు పర్యటించారు. కాలువలపై నిర్మాణాలు చేపడితే ఏవిధంగా మురుగు వెళ్తుందని నిర్వాసితులను ప్రశ్నించారు. ముందస్తుగా మీరే ఆక్రమణలు తొలగించుకోవాలని వారికి సూచించారు. ఇదిలా ఉండగా నగరంలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా మంగళవారం కాలువలు బ్లాక్ కాకుండా చర్యలు తీసుకున్నారు. సుభాష్‌రోడ్డులో కాలువ బ్లాక్ అవడంతో సక్షన్ ఆపరేషన్ మిషన్ ద్వారా పూడికను తొలగింపజేశారు.

### నిషేధిత ప్లాస్టిక్ సీజ్



జనరల్ స్టోర్‌ను తనిఖీ చేస్తున్న ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి

**అనంతపురం కార్పొరేషన్:** నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి 10 కేజీల నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. మంగళవారం ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి బృందం నగరంలోని పీటీసీ పరిసర ప్రాంతంలో ఉన్న జనరల్ స్టోర్స్, చికెన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొన్ని షాపుల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ లభించడంతో ఆ షాపులపై రూ.30 వేల వరకు జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంహెచ్ఓ పేర్కొన్నారు. తొలి దశలో నోటీసులు, జరిమానా విధిస్తామని, తదుపరి కమిషనర్ ఆదేశాల మేరకు ట్రేడ్ లైసెన్సును రద్దు చేస్తామన్నారు. ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రజలు సైతం సామాజిక స్పృహతో వ్యవహరించాలన్నారు. ఎంహెచ్ఓ వెంట ఏసీపీ మారుతిహరిప్రసాద్, తదితరులున్నారు. ఇదిలా ఉండగా ప్లాస్టిక్‌ను నియంత్రించడానికి నగరపాలక సంస్థ ముమ్మర చర్యలు చేపట్టింది. ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలపై ప్రజారోగ్యాధికారులు ఆటోల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు.

### బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీ



షఫీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

**కంబదూరు:** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి కాలేదని మనోవేదనకు గురై మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షఫీ కుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వలంటీర్ తిమ్మరాజు, పాముకాటుతో మృతి చెందిన రామాంజి కుటుంబాలను మాజీ ఎంపీ తలారి రంగయ్య పరామర్శించారు. మంగళవారం ఆయన మండలంలోని అచ్చంపల్లిలోని బాధిత కుటుంబాలకు ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, నాయకులు డాక్టర్ బొమ్మయ్య, సర్పంచ్ అమర్ ఫయాజ్, దాదు, రాజు, కుర్లపల్లి గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు నాగేంద్ర, నాగరాజు ఉన్నారు.

### స్టార్టర్ చోరీ

**గార్లదిన్నె:** మండల కేంద్రంలో మంచి నీటి బోరుకు సంబంధించిన విద్యుత్ స్టార్టర్ మంగళవారం చోరీ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఇందిరమ్మ కాలనీలో ప్రజలకు నీరందించే బోరుకు సంబంధించిన స్టార్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పంచాయతీ సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దుండగులు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా నీరు లేక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు.